## ఖర్చు లేకుండా కుంభమేళా వెళ్లొచ్చిలా!



కంటెంట్ క్రియేటర్ దివ్య ఫొఫానీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: కంటెంట్ క్రియేటర్ దివ్య ఫొఫానీ అరుదైన సాహసం చేశారు. కుంభమేళాలో పవిత్ర స్నానమాచరించేందుకు కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా పూర్తిగా అపరిచితుల దాతృత్వంపై ఆధారపడి ముంబై నుంచి మహాకుంభ్‌కు సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తిచేశారు. ఈ నెల 12న ముంబైలో ప్రారంభమై రెండు రోజుల తర్వాత ప్రయాగ్‌రాజ్‌లో ముగిసిన ఈ ఉత్కంఠభరిత యాత్రను విశ్వాసం, సాహసం, మానవ దయతో కూడిన అద్భుత సాహసయాత్రగా ఫొఫానీ అభివర్ణించారు. అద్వితీయమైన ఈ తీర్థయాత్రపై ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టుకు ఇప్పటికే 36 వేలకుపైగా లైక్‌లు లభించాయి. ఈ యాత్ర తనకు అద్భుతమైన అనుభూతిని మిగిల్చిందని, పవిత్ర స్థలాన్ని చేరుకునేందుకు భారతీయులు ఎలాంటి సంకోచం లేకుండా పరస్పరం ఎలా సహకరించుకుంటారో ఈ ప్రయాణంలో ప్రత్యక్షంగా చూశానని, అపరిచితుల దయాగుణంతోపాటు అద్భుతమైన మన దేశ ఐక్యతపై తనకున్న విశ్వాసాన్ని ఈ యాత్ర మరోసారి చాటిచెప్పిందని ఫొఫానీ పేర్కొన్నారు. 'లిఫ్ట్' అని రాసిన ప్లకార్డును చేతపట్టుకుని ముంబై శివారులోని థానే నుంచి బయలుదేరిన ఫొఫానీ తొలి విడతలో బైకులు, స్కూటర్లు, కార్లు, ట్రక్కులపై ప్రయాణించి నాగ్‌పూర్‌కు చేరుకోవడం ద్వారా తన మొత్తం 1,500 కి.మీ. యాత్రలో సగభాగాన్ని పూర్తిచేశారు. తదుపరి విడతలో జబల్‌పూర్ (మధ్యప్రదేశ్) వరకు పలువురు దయామయులు లిఫ్ట్ ఇవ్వడంతో ఆయన ప్రయాణం సాఫీగానే సాగింది. జబల్‌పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు ట్రక్కులకు అనుమతించకపోవడంతో అనేక సవాళ్లు ఎదురయ్యాయని, అయినప్పటికీ స్థానికుల తోడ్పాటుతో యాత్రను పూర్తి చేయగలిగానని అన్నారు.



## మర మనిషికి మెదడు

న్యూయార్క్, ఫిబ్రవరి 22: రోబోటిక్స్ రంగంలో సరికొత్త ఆవిష్కరణ చోటుచేసుకున్నది. అమెరికాకు చెందిన ఫిగర్ ఏఐ అనే సంస్థ 'హెలిక్స్' పేరుతో సరికొత్త రోబోను ఆవిష్కరించింది. ఈ రోబో మనుషుల్లా ఆలోచించగలదని, ఇంటిలోని ప్రతీ వస్తువును గుర్తించగలదని ఫిగర్ ఏఐ సంస్థ వ్యవస్థాపకుడు బ్రెట్ ఆడ్‌కాక్ ప్రకటించారు. మన మాటలను అర్థం చేసుకుంటుందని, మనం అడిగిన ఏ వస్తువునైనా తెచ్చి మన చేతికిస్తుందని చెప్పారు. ఈ రోబో ఎగువ భాగం మొత్తాన్ని నియంత్రించవచ్చని, మణికట్లు, తల, మొండెం, విడిగా వేళ్లపై నియంత్రణ ఉంటుందని పేర్కొన్నారు. ఒక రోబోపై ఈ స్థాయిలో నియంత్రణ పొందడం ఇదే మొదటిసారి అని చెప్పారు.

## నడుం నొప్పికి వెన్ను ఇంజెక్షన్లు వద్దు!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: మీరు తీవ్రమైన వెన్ను నొప్పితో బాధపడుతున్నారా? దాని నుంచి ఉపశమనం కోసం వెన్నుకు ఇంజెక్షన్లు చేయించుకుంటున్నారా? అయితే వద్దని హెచ్చరిస్తున్నారు అంతర్జాతీయ పరిశోధకులు. కెనడా, అమెరికా, ఆస్ట్రేలియాకు చెందిన రోగులపై వీరు చేసిన పరిశోధనకు సంబంధించిన వివరాలు బీఎంజేలో ప్రచురితమైంది. క్యాన్సర్, ఇన్‌ఫెక్షన్, ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్‌తో సంబంధం లేని దీర్ఘకాలిక వెన్నునొప్పితో బాధపడే వారికి ఎపిడ్యూరల్ స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, నరాల బ్లాక్‌లను సిఫార్సు చేయరాదని వీరు సూచించారు. ఈ తీవ్ర వెన్ను నొప్పి రోగం ప్రపంచ వ్యాప్తంగా ఉందని, ఇది శారీరక వైకల్యానికి కూడా దారి తీస్తుందని, ముఖ్యంగా 20-59 ఏండ్ల మధ్య వయస్కుల్లో ప్రతి ఐదుగురిలో ఒకరికి ఇది జరుగుతున్నదని పరిశోధకులు తెలిపారు. ఇంకా ఎక్కువ వయస్కులను అచేతనంగా మార్చివేస్తున్నదన్నారు. మెదడుకు నొప్పికి సంబంధించిన సంకేతాలు చేరకుండా నిరోధించే ఎపిడ్యూరల్ ఇంజక్షన్లు, నరాల బ్లాక్‌లు, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ విధానాలు అనుసరిస్తున్నారని, అయితే ఈ వైద్య విధానాలు అస్థిరంగా ఉన్నాయని వారు తెలిపారు. ఈ అనిశ్చితిని పరిష్కరించడానికి పరిశోధనా బృందం దీర్ఘకాలిక, క్యాన్సర్ సంబంధం కాని వెన్నెముక నొప్పికి సాధారణంగా వినియోగించే 13 ఇంటర్వెన్షనల్ విధానాల ప్రభావం, వాటి ఇబ్బందులు, ప్రమాదాలను విశ్లేషించింది. ప్లెసిబో చికిత్సలతో పోలిస్తే వెన్నెముక ఇంజెక్షన్లు అర్థవంతమైన ఉపశమనాన్ని అందించలేదని వారు తేల్చారు. ఈ క్రమంలో ఈ చికిత్సా విధానాలు సరైన ఫలితాలను ఇవ్వకపోగా రోగులపై ఆర్థిక భారం మోపుతున్నాయని, వైద్యులు, రోగులు ఈ చికిత్స విధానాలకు దూరంగా ఉండి ప్రత్యామ్నాయ విధానాలను పాటించాలని వారు సూచించారు.

## ఎగిరే కార్.. ఉండదు ట్రా'ఫికర్'

రోడ్డుపై బారులు తీరిన వాహనాల మధ్య ఇరుక్కుపోకుండా.. వాటి మీదుగా ఎగురుతూ వెళితే ఎలా ఉంటుంది? అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన స్టార్టప్ కంపెనీ అలెఫ్ ఏరోనాటిక్స్ 'మాడల్ జీరో' కార్ దీన్ని నిజం చేయనుంది. ఇటీవల జరిపిన పరీక్షల్లో ఈ కారు ఎలాంటి రెక్కలు లేకుండానే గాల్లోకి ఎగిరింది. ఈ కారును 110 మైళ్లు గాలిలో, 200 మైళ్లు రోడ్డుపై ప్రయాణించగల రేంజ్‌తో తీసుకు రానున్నారు. ఇది ఉన్న చోటు నుంచే పైకి ఎగరగలదు. దీని ధర దాదాపు రూ.2.5 కోట్లు ఉండొచ్చని అంచనా. ఇప్పటికే ఈ కారు కోసం 3300 ప్రీ ఆర్డర్లు వచ్చాయి. 2035 నాటికి ఈ కారు అప్‌డేటెడ్ మాడల్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చే అవకాశం ఉందని అలెఫ్ ఏరోనాటిక్స్ కంపెనీ వర్గాలు తెలిపాయి.



## మంత్రికి విరిగిన సీటు కేటాయింపు

### ఎయిర్ ఇండియా తీరుపై మండిపడ్డ శివరాజ్



భోపాల్, ఫిబ్రవరి 22: విమానంలో విరిగిపోయిన సీటును తనకు కేటాయించినందుకు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ శనివారం ఎయిర్ ఇండియాపై మండిపడ్డారు. ప్రయాణికుల నుంచి పూర్తి చార్జీలను వసూలు చేసి వారికి విరిగిపోయిన సీట్లను కేటాయించడాన్ని అనైతిక చర్యగా ఆయన అభివర్ణించారు. విమాన ప్రయాణంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. దీనికి వెంటనే ఎయిర్ ఇండియా స్పందించి మంత్రికి క్షమాపణలు చెప్పింది. ఆయనకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కోరింది. తన అనుభవాన్ని చౌహాన్ వివరిస్తూ పూసాలో జరగనున్న రైతుల ప్రదర్శన శాలను, ప్రారంభించి కురుక్షేత్రలో ప్రకృతి సేద్యం మిషన్ సమావేశంలో పాల్గొనేందుకు తాను భోపాల్ నుంచి ఢిల్లీకి విమానంలో ప్రయాణించానని తెలిపారు. తనకు కేటాయించిన సీటులో కూర్చోగా అది విరిగిపోయి, కుంగిపోయి ఉండడాన్ని గమనించానని ఆయన చెప్పారు.

## గంగా జలాల స్వచ్ఛతపై భిన్న వాదనలు

ప్రయాగ్‌రాజ్: త్రివేణి సంగమంలో జరుగుతున్న మహా కుంభమేళాకు కోట్లాది మంది భక్తులు తరలివచ్చి స్నానమాచరిస్తున్న నేపథ్యంలో అక్కడి నీటి స్వచ్ఛతపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. నీటి స్వచ్ఛతపై కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ మేరకు నివేదిక విడుదల చేసింది. కానీ సీపీసీబీ నివేదిక అసంబద్ధమని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, అలహాబాద్ యూనివర్సిటీ, బిహార్ యూనివర్సిటీలోని కొందరు వాతావరణ శాస్త్రవేత్తలు కొట్టిపారేస్తున్నారు. సీపీసీబీ నివేదికలో నైట్రేట్, ఫాస్పేట్ స్థాయిల గురించి పేర్కొనలేదని తెలిపారు. భక్తులు ఎలాంటి ఆందోళన చెందకుండా స్నానం చేయవచ్చని వారు స్పష్టం చేశారు. సీపీసీబీ నివేదిక ప్రకారమే నీటిలోని ఆక్సిజన్ శాతం సరిపడా ఉందని పేర్కొన్నారు.

# భారత్‌లో ట్రంప్ ప్రకంపనలు

- ఎన్నికల్లో అమెరికా సాయంపై దుమారం
- దర్యాప్తు చేయడానికి సిద్ధమైన ఈడీ
- సహాయం నిజం కాదు: వాషింగ్టన్ పోస్ట్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: భారత్‌కు 21 మిలియన్ డాలర్ల సహాయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తీవ్ర ఆరోపణలు దేశంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్ల (సుమారు రూ.182 కోట్లు) సహాయాన్ని భారత్‌కు అందించడం ద్వారా 2024 సాధారణ లోక్‌సభ ఎన్నికల్లో అమెరికా జోక్యం చేసుకుందని వస్తున్న ఆరోపణలపై వివిధ కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేయించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. 'నీకది.. నాకిది' తరహాలో ఇదో కిక్‌బ్యాక్ పథకమని ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు

**కాంగ్రెస్ వైపే అందరి చూపు**

మస్క్ ఆధ్వర్యంలోని డోజ్ శాఖ చేసిన ఆరోపణలతో అన్ని వేళ్లూ విపక్ష కాంగ్రెస్ వైపు తిరిగాయి. కేంద్రంలోని బీజేపీని గద్దె దించడానికి అప్పటి అధ్యక్షుడు జో బైడెన్ ద్వారా రాహుల్ గాంధీయే ఆ సహాయాన్ని అందుకున్నారంటూ బీజేపీ నేతలు దాడికి దిగారు. బీజేపీ హయాంలోనే ఇది జరిగిందని ఆరోపణలు రావడంతో దర్యాప్తుకు కేంద్రం ఆదేశించింది

**ఎక్కడి నుంచి దర్యాప్తు చేయాలి?**

ఈ అంశంపై దర్యాప్తు ఎలా, ఎక్కడి నుంచి ప్రారంభించాలి అనే అంశాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పరిశీలిస్తున్నది. మనీ లాండరింగ్ కింద కేసు నమోదు చేద్దామంటే దీనికి సంబంధించి దేశంలో ఇంతవరకు ఎలాంటి ఎఫ్‌ఐఆర్ నమోదు కాలేదు. అందుకే సీబీఐ, పోలీసు శాఖల సహాయం తీసుకోవాలని ఈడీ యోచిస్తున్నది.

**రాజకీయ దుమారం**

ఈ నిధుల అంశంపై భారత్‌లో రాజకీయ దుమారం చెలరేగింది. అమెరికా ఆరోపణలపై ఇప్పటికే భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా చర్య భారత్ ఎన్నికలలో జోక్యం చేసుకోవడమేనని ఆరోపించింది. దీనిపై దర్యాప్తు చేయాలని నిర్ణయించింది. ఇది రాజకీయ విమర్శలకు కూడా తావిచ్చింది. ఈ అంశం వెల్లడి వెనుక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హస్తం ఉందని బీజేపీ ఆరోపించింది. యూఎస్‌కు చెందిన ఫైనాన్సియర్ జార్జి సోరోస్‌తో కుమ్మక్కై ప్రధాని మోదీపై ద్వేషాన్ని సృష్టించడం ద్వారా భారత దేశ ప్రజాస్వామ్యం, సార్వభౌమాధికారాన్ని దెబ్బతీయడానికి కాంగ్రెస్ ప్రయత్నం చేస్తున్నదని విమర్శించింది. భారత్‌లో డీప్ స్టేట్ ఆస్తులను నిలబెట్టుకోవడానికి ఈ నిధులను వినియోగించారని బీజేపీ ఆరోపించింది. ఈ వ్యవహారాన్ని తేల్చేందుకు సమగ్ర దర్యాప్తు అవసరమని బీజేపీ నేత ప్రదీప్ భండారి పేర్కొన్నారు.

**డోజ్‌ది తప్పుడు వాదన**

ఒక పక్క ట్రంప్ ఆరోపణలు భారత్‌లో తీవ్ర ప్రకంపనలు సృష్టించగా, అలాంటిదేమీ లేదని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. భారత్‌కు 21 మిలియన్ డాలర్ల సహాయం చేసినట్టు ట్రంప్ ఆరోపించారని, అయితే దానికి సంబంధించి ఎలాంటి రికార్డులు లేవని ఆ పత్రిక ఒక కథనంలో పేర్కొంది. అసలు భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచే పథకం కానీ, దానికి నిధుల సహాయం కానీ ఏమీ లేవని స్పష్టం చేసింది.దీనిపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా మాట్లాడుతూ బీజేపీని ఓడించడానికి రాహుల్ గాంధీ విదేశీ సహాయం కోరారని ఆ పార్టీ నేతలు చేసిన ఆరోపణలు అబద్ధమని తేలాయన్నారు. ఈ నిజం బయటకు వచ్చిన తర్వాత బీజేపీ నేతలు నీళ్లు నములుతున్నారని విమర్శించారు. వారు ముఖం ఎక్కడ పెట్టుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



### భగవద్గీత సాక్షిగా కాష్ పటేల్ ప్రమాణం

**వెంటనే 1000 మందికిపైగా ఎఫ్‌బీఐ ఏజెంట్స్ బదిలీ!**

వాషింగ్టన్: భారతీయ అమెరికన్ కాష్ పటేల్ భగవద్గీతపై ప్రమాణం చేసి నూతన ఎఫ్‌బీఐ డైరెక్టర్ పదవీ బాధ్యతల్ని చేపట్టారు. అమెరికాలో అత్యంత కీలకమైన దర్యాప్తు సంస్థకు ఓ భారతీయ అమెరికన్ డైరెక్టర్ కావటం ఇదే మొదటిసారి. దేశ అత్యున్నత సంస్థకు నేతృత్వం వహించటం జీవితంలో తనకు లభించిన ఒక గొప్ప గౌరవంగా భావిస్తున్నానంటూ కాష్ పటేల్ చెప్పారు. అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ, 'ఎఫ్‌బీఐకి ఉత్తమ డైరెక్టర్ అవుతారు. ఏజెంట్స్ ఇష్టపడే వ్యక్తి అవుతాడు' అంటూ ప్రశంసలు కురిపించారు. వాషింగ్టన్‌లోని 1000 మంది ఎఫ్‌బీఐ ఏజెంట్లను బదిలీ చేయాలని కాష్ పటేల్ ఆదేశించినట్టు సమాచారం.

### హానికర కంటెంట్‌పై నియంత్రణ!

**కేంద్రం పరిశీలన**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: డిజిటల్ వేదికలలో హానికరమైన కంటెంట్‌ను నియంత్రించడానికి ప్రస్తుతమున్న చట్టబద్ధమైన నిబంధనలు, చట్టపరంగా కొత్త నిబంధనలు ఏమన్నా తీసుకురావాల్సిన అవసరం ఉందా అన్న అంశాలను కేంద్ర సమాచారశాఖ పరిశీలిస్తున్నది. ఒక హాస్య కార్యక్రమంలో భారతీయ కుటుంబ వ్యవస్థను కించపరిచేలా, ప్రజల మనోభావాలు దెబ్బతినేలా యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియా చేసిన దారుణమైన వ్యాఖ్యలపై నిరసనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం వాటిపై నిఘా పెంచాలని యోచిస్తున్నది. ఈ అంశంపై పార్లమెంటరీ ప్యానెల్ పంపిన ప్రశ్నలకు సమాచార, ప్రసార శాఖ సమాధానం ఇస్తూ ప్రస్తుత చట్టం లో వీటి నిరోధానికి నిబంధలను ఉన్నప్పటికీ, ఇలాం టి హానికరమైన కంటెంట్‌ను నిరోధించడానికి కఠినంగా చట్టంలో నిబంధనలు పొందుపర్చాలన్న డిమాండ్లు అధికమవుతున్నాయని తెలిపింది.

### రైతులతో కేంద్రం చర్చల్లో పురోగతి!

**మార్చి 19న మరోసారి సమావేశం**

చండీగఢ్, ఫిబ్రవరి 22: తమ డిమాండ్ల సాధనకు ఏడాది కాలంగా ఆందోళన చేస్తున్న రైతులతో ఎట్టకేలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ శనివారం చర్చలు జరిపారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు పలు డిమాండ్లు నెరవేర్చాలని రైతులు ఆందోళన చేస్తున్నారు. రైతు నేతలు జగ్జీత్ సింగ్ డల్లేవాల్, శర్వణ్ సింగ్ పాంధేర్ తదితరులతో కూడిన 28 మంది బృందంతో మంత్రి చౌహాన్ సమావేశమయ్యారు. వివిధ సమస్యలపై రెండు గంటల పాటు చర్చించారు. చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని చౌహాన్ వెల్లడించారు. రెండో విడత చర్చలను మార్చి 19న నిర్వహించాలని నిర్ణయించారు. చర్చల వివరాలను అధికారులు వెల్లడించలేదు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, ప్రహ్లాద్ జోషి, పంజాబ్ మంత్రులు హర్పల్ సింగ్ చీమా, గుర్మీత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి నుంచి తప్పుకోనున్న షిండే?


### అమిత్ షా పర్యటనకు గైర్హాజరు


ముంబై, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో అధికారంలో ఉన్న మహా కూటమి నుంచి ఏక్ నాథ్ షిండే తప్పుకోవచ్చన్న వార్తలు వినిపిస్తున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం పుణె పర్యటనలో ఉండగా షిండే మొహం చాటేయడంతో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. గత కొంత కాలంగా బీజేపీ నాయకత్వంపై షిండే అసంతృప్తిగా ఉన్నట్టు రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి పదవి విషయంలో షిండే, ఫడ్నవీస్ మధ్య విభేదాలు వచ్చినట్లు సమాచారం. ఇటీవల జరిగిన కొన్ని క్యాబినెట్ సమావేశాలకు కూడా షిండే గైర్హాజరయ్యారు. 'నన్ను తేలిగ్గా తీసుకోవద్దు.. నేనేం చేయగలనో మీరంతా 2022లో చూశారు' అంటూ శుక్రవారం షిండే చేసిన ప్రకటన కూడా పెద్ద ఎత్తున చర్చలకు దారి తీసింది. షిండే ప్రకటన మహా కూటమి మంచి కోసమేనని చెబుతున్నా.. మహా కూటమికి ఇది హెచ్చరిక అన్న వాదన కూడా వినిపిస్తోంది.

## ఆకాశహర్మ్యాల్లో చైనా టాప్

మబ్బులను ముద్దాడేట్టు ఉండే ఆకాశహర్మ్యాలను ఎక్కితే వినీలాకాశంలో విహరించినట్టే ఉంటుంది కదూ.. ఆకాశాన్నంటే ఇలాంటి భవంతులకు అమెరికా చిరునామా అని ఇప్పటివరకూ అనుకొన్నాం. అయితే, అగ్రరాజ్యాన్ని వెనక్కినెట్టి డ్రాగన్‌దేశం చైనా ఆ స్థానాన్ని అధిరోహించింది. హాంకాంగ్‌లోని 564 భవనాలను కలుపుకొంటే అక్కడ 45 అంతస్తుల (150 మీటర్లు) కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలు మొత్తంగా 3,253 వరకు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 150 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలు ఏ దేశాల్లో ఎన్ని ఉన్నాయో తెలుసా?

- స్పెషల్ టాస్క్‌బ్యూరో, నమస్తే తెలంగాణ



ప్రపంచంలో ఎత్తైన భవనం బుర్జ్‌ఖలీఫా, దుబాయ్
828 మీటర్లు
163 అంతస్తులు



ఇండియాలో ఎత్తైన భవనం పలాయిస్ రాయల్, ముంబై
320 మీటర్లు
88 అంతస్తులు

తెలంగాణలో ఎత్తైన భవనం
లోధా బెల్లీజా టవర్స్, హైదరాబాద్
(153 మీటర్లు — 45 అంతస్తులు)



## మయన్మార్ ముఠాల చెరలో భారతీయులు

**ఉద్యోగాల కోసం సైబర్ మోసాలు చేస్తున్న 2 వేల మంది**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: మయన్మార్‌లోని మ్యావడీ కేంద్రంగా భారతీయులను మోసం చేసే సైబర్ ముఠాలు చురుగ్గా పని చేస్తున్నాయి. ఉద్యోగాల ఎర వేసి భారత యువతను ఆకర్షిస్తున్న ముఠాలు.. అక్కడికి వెళ్లిన తర్వాత వారితో నిర్బంధంగా పని చేయించుకుంటున్నాయి. వారితో భారత్‌లోని ప్రజలను లక్ష్యంగా చేసుకొని బలవంతంగా సైబర్ మోసాలు చేయిస్తున్నాయి. ఇటీవల ఓ సైబర్ ముఠా చెర నుంచి ముగ్గురు భారతీయులు తప్పించుకోవడంతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. మయన్మార్ - థాయ్‌లాండ్ సరిహద్దులోని మ్యావడీ ప్రాంతం సాయుధ మిలీషియా ఆధీనంలో ఉండటం, ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో సైబర్ ముఠాలు ఈ ప్రాంతంలో తిష్ఠ వేశాయి. ఎవరైనా బాధితులు తప్పించుకొని దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు వస్తే తప్ప వారిని రక్షించేందుకు భారత రాయబార కార్యాలయం సైతం ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నది. డిసెంబర్ నుంచి ఇప్పటివరకు మ్యావడీలో ఆరుగురిని రక్షించినట్టు యాంగోన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ఇప్పటికీ దాదాపు 2 వేల మంది భారతీయులు ఈ సైబర్ ముఠాల వలలో చిక్కుకొని ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

## 'భాషలపై' దూషణలు.. దాడులు

- కర్ణాటక-మహారాష్ట్ర సరిహద్దులో ఉద్రిక్తతలు
- అటు, ఇటు ఇద్దరు ఆర్టీసీ సిబ్బంది బాధితులు



బెళగావి జిల్లాలో కేఎస్‌ఆర్టీసీ బస్ కండక్టర్‌పై దాడి

ముంబై, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): మరాఠీలో జవాబు ఇవ్వనందుకు కేఎస్ఆర్టీసీ కండక్టర్‌పై దాడి జరగడం, కన్నడలో మాట్లాడలేదని మహారాష్ట్ర బస్ డ్రైవర్‌పై దాడి జరగడం ఇరు రాష్ట్రాల సరిహద్దుల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం కర్ణాటకలోని బెళగావి జిల్లా బలేకుంద్రి గ్రామం వద్ద కేఎస్‌ఆర్టీసీ బస్సు ఎక్కిన ఓ బాలిక(14) కండక్టర్ మహదేవతో ఉచిత టికెట్ విషయమై గొడవకు దిగింది. తనకు మరాఠీ రాదని, కన్నడలో మాట్లాడాలని కండక్టర్ ఆ బాలికను కోరారు. దానికి ఆ బాలిక మరాఠీ రాకపోతే ఎలా అంటూ కండక్టర్‌ను దూషించింది. ఇంతలో హఠాత్తుగా పెద్ద సంఖ్యలో గుమికూడిన జనాలు కండక్టర్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో నలుగురిని అరెస్ట్ చేశారు. మరోవైపు బాలిక ఫిర్యాదు మేరకు మహదేవపై పోక్సో కేసును నమోదు చేశారు. శుక్రవారం రాత్రి బెళగావి సమీపంలో జరిగిన మరో ఘటనలో మహారాష్ట్ర ఆర్టీసీ బస్ డ్రైవర్ ముఖంపై కొందరు నలుపు రంగు పూసి చితకబాదారు. ఆ డ్రైవర్ కన్నడలో మాట్లాడలేదని ఆగ్రహించిన కర్ణాటక రక్షణ వేదిక కార్యకర్తలు ఈ దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరు రాష్ట్రాల్లో సరిహద్దుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి.

## ఐఆర్‌ఎస్ అధికారి కుటుంబం ఆత్మహత్య!

### కేరళలోని కొచ్చిలో ఘటన

కొచ్చి, ఫిబ్రవరి 22: ఐఆర్‌ఎస్ అధికారితో పాటు అతని సోదరి, తల్లి అనుమానాస్పదంగా మృతి చెందడం కేరళలోని కొచ్చిలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కస్టమ్స్ విభాగంలో అదనపు కమిషనర్‌గా పని చేస్తున్న ఝార్ఖండ్‌కు చెందిన మనీశ్ విజయ్ తన తల్లి శకుంతల దేవి, సోదరి షాలిని విజయ్‌తో పాటు కొచ్చిలో ఉంటున్నారు. నాలుగు రోజులుగా మనీశ్ ఆఫీస్‌కు రాకపోవడంతో సహోద్యోగులు ఇంటికి వెళ్లి చూడగా దుర్వాసన వచ్చింది. పోలీసుల సాయంతో ఇంట్లోకి వెళ్లి చూడగా మనీశ్, అతని సోదరి వేర్వేరు గదుల్లో ఉరి వేసుకొని కనిపించారు. మరో గదిలో వారి తల్లి విగతజీవిగా కనిపించింది. ఆమెను తెల్లటి వస్త్రంలో చుట్టి, పూలు చల్లారు. వారి మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.



## ఉనికిలో లేని శాఖకు 20 నెలలుగా మంత్రి

**ఎట్టకేలకు గుర్తించిన పంజాబ్ సీఎం**

**గెజిట్ నోటిఫికేషన్ ద్వారా సవరణ**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: పంజాబ్ ప్రభుత్వ పాలనలో విచిత్ర ఘటన చోటు చేసుకుంది. రాష్ట్ర మంత్రి, ఆప్ నాయకుడు కుల్దీప్ సింగ్ ధలీవాల్ ఉనికిలో లేని ఒక శాఖను 20 నెలలుగా 'నిర్వహించారు!' ఈ విషయాన్ని తీరిగ్గా గుర్తించిన పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఎట్టకేలకు గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అవసరమైన సవరణలు చేపట్టారు. రాష్ట్రంలో ఉనికిలో లేని పరిపాలనా సంస్కరణల శాఖను మంత్రి కుల్దీప్ సింగ్ ధలీవాల్‌కు పంజాబ్ ప్రభుత్వం గతంలో కేటాయించింది. ఇప్పుడు ఆ శాఖ నుంచి తప్పించి కేవలం ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖను మాత్రమే ఉంచారు. మొదట్లో వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రిగా ధలీవాల్ ఉన్నారు. 2023 మేలో క్యాబినెట్‌లో మార్పులు చేర్పులు చేయగా ఆ శాఖ నుంచి ఆయనను తప్పించారు. ఆ తర్వాత ఆయనకు ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖ, పరిపాలనా సంస్కరణల శాఖను కూడా అప్పగించారు. 2024 సెప్టెంబర్‌లో మరోసారి క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ జరగగా ఆ రెండు శాఖలను ధలీవాల్ కొనసాగించడం విశేషం. అయితే, పరిపాలనా సంస్కరణల శాఖ అన్నదే ఉనికిలో లేదని ఇప్పుడు బయటపడింది. ఈ వ్యవహారంపై ఆప్ ప్రభుత్వాన్ని బీజేపీ ఎండగట్టింది.

## లంచమిస్తేనే జైల్లో తిండి పెట్టారు!

### ఉగాండాలో మానవ హక్కుల ఉల్లంఘనపై ఎన్నారై ఆవేదన



ముంబై, ఫిబ్రవరి 22: తన తండ్రికి చెందిన మాజీ ఉద్యోగిని అపహరించి, హత్య చేశారన్న ఆరోపణలపై ఉగాండాలో అరెస్టై మూడు వారాలు జైలుపాలైన భారతీయ సంతతి సంపన్న వ్యాపారవేత్త పంకజ్ ఓస్వాల్ కూతురు వసుంధరా ఓస్వాల్ ఉగాండాలోని జైలులో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆరోపించారు. పంకజ్ ఓస్వాల్ వద్ద గతంలో పనిచేసిన ముకేష్ మేనరియాను అపహరించి, హత్య చేసినట్టు వసుంధరా ఓస్వాల్(26)పై నిరుడు తప్పుడు ఆరోపణలు నమోదయ్యాయి. అయితే ముకేష్ టాంజానియాలో సజీవంగా ఉన్నట్టు తర్వాత బయటపడింది. తనను ఐదు రోజులు పోలీసు కస్టడీలోకి తీసుకుని ఆ తర్వాత రెండు వారాలు జైలులో పడేశారని శుక్రవారం ఆమె విలేకరులకు వివరించారు. జైలులో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని, తనకు స్నానం చేసేందుకు అనుమతి ఇవ్వలేదని, కనీసం ఆహారం, మంచినీరు ఇవ్వలేదని ఆమె చెప్పారు. ఆహారం, మంచినీరు, ఇతర అవసరాలను తనకు అందచేసేందుకు తన తల్లిదండ్రులు పోలీసు అధికారులకు లంచం ముట్టచెప్పాల్సి వచ్చిందని వసుంధర వాపోయారు. ఒక దశలో తాను వాష్‌రూముకు వెళ్లడానికి కూడా అనుమతించలేదన్నారు.

## త్వరలో భారత్‌పై ప్రతీకార సుంకాలు

### ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్ డీసీ: భారత్, చైనా వంటి దేశాలపై త్వరలో ప్రతీకార సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. అమెరికా వస్తువులపై ఆ దేశాలు ఎంత సుంకాన్ని విధిస్తాయో తాము కూడా అంతే సుంకాన్ని విధిస్తామని ఆయన వెల్లడించారు. శుక్రవారం నాడిక్కడ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ త్వరలోనే తాము ప్రతీకార సుంకాలు విధిస్తామని చెప్పారు. ఆ దేశాలు తమపై సుంకాలు విధిస్తే తాము కూడా సుంకాలు విధిస్తామని ఆయన అన్నారు. భారత్ లేదా చైనా తమ పట్ల ఏ విధంగా వ్యవహరిస్తున్నాయో తాము కూడా అ విధంగానే వారి పట్ల వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. గత వారం, భారత ప్రధాని నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక చర్చలకు ముందు భారతదేశ సుంకాల స్వరూపంపై ట్రంప్ వ్యాఖ్యానిస్తూ భారత్ అత్యధిక సుంకాలు విధిస్తోందని, అక్కడ వ్యాపారం చేయడం చాలా కష్టమని అన్నారు. ప్రధాని మోదీతో టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ సమావేశం కావడాన్ని గురించి ప్రశ్నించగా భారత్‌తో వ్యాపారం చేయాలని మస్క్ భావిస్తున్నట్టు ఉందన్నారు. భారత్‌లో అత్యధికంగా సుంకాలు ఉన్నాయని, ఓ కంపెనీని నడుపుతున్న మస్క్ భారత్‌లో వ్యాపారం చేయడం గురించి మోదీతో సమావేశమై ఉండవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశ గత వాణిజ్య విధానాలను ఆయన ప్రస్తావిస్తూ హార్లీ డేవిడ్‌సన్ మోటార్ సైకిళ్ల ఉదంతాన్ని గుర్తు చేశారు.